క్లుప్తంగా

నేడు బీజేపీ సమావేశం

పూడూరు: మండల పరిధి మన్నెగూడలో శనివారం బీజేపీ కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు రాఘవేందర్ తెలిపారు. శనివారం ఉదయం 11 గంటలకు సమీక్ష ఉందని, కార్యక్రమంలో సినిమా సెన్సార్ బోర్డు సభ్యుడు మల్లేశ్ పటేల్, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పరమేశ్వర్‌రెడ్డి పాల్గొననున్నారని ఆయన పేర్కొన్నారు. పార్టీ శ్రేణులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

గిర్దావరిగా రవీందర్ చారి



కుల్కచర్ల: నూతన గిర్దావరిగా రవీందర్ చారి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. బొంరాస్‌పేట్ మండలంలో విధులు నిర్వహించిన రవీందర్.. సాధారణ బదిలీల్లో భాగంగా కుల్కచర్లకు వచ్చారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ.. రెవెన్యూ పరమైన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, అందరితో కలిసి పనిచేస్తానని తెలిపారు.

'కృతజ్ఞత' సభకు టీచర్లు



సభకు వెళ్లిన ఉపాధ్యాయులు

బొంరాస్‌పేట: సీఎం కృతజ్ఞత సభకు ఉపాధ్యాయ సంఘాలు తరలి వెళ్లాయి. అధికారంలోకి వచ్చిన అనతి కాలంలో టీచర్లకు బదిలీలు, పదోన్నతులు కాంగ్రెస్ ప్రభుత్వం కల్పించింది. దీనికి కృతజ్ఞతగా శుక్రవారం హైదరాబాద్ ఎల్బీస్టేడియంలో నిర్వహించిన సభకు తరలిన ఉపాధ్యాయులు తరలి వెళ్లారు. వెళ్లిన వారిలో అనిల్‌కుమార్, రవీందర్‌గౌడ్, బాకారం చంద్రశేఖర్, మల్లయ్య ఉన్నారు.

సీడీపీఓగా కాంతారావు

తాండూరు రూరల్: ఐసీడీఎస్ తాండూరు ప్రాజెక్టు సీడీపీఓగా కాంతారావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో పని చేసిన సీడీపీఓ రేణుక ఫిబ్రవరిలో బదిలీపై వెళ్లారు. ఆమె స్థానంలో అడిషనల్ సీడీపీఓగా ఉన్న శ్రీలక్ష్మికి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ నేపథ్యంలో సాధారణ బదిలీల్లో భాగంగా మర్పల్లి ప్రాజెక్టు సీడీపీఓ కాంతారావు.. ఇక్కడికి వచ్చారు.

ముర్రుపాలు అమృత తుల్యం



మంచన్‌పల్లిలో చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తున్న ఆశలు

పూడూరు: ముర్రుపాలు అమృత తుల్యం, పుట్టిన గంటలోపు బిడ్డకు వాటిని పట్టాలని అంగన్‌వాడీ టీచర్లు అరుణాదేవి, చంద్రకళలు అన్నారు. శుక్రవారం మండల పరిధి సోమన్‌గుర్తి, మంచన్‌పల్లి కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తల్లిపాలతో రోగనిరోధక శక్తి పెరిగి బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందని తెలిపారు. పుట్టిన రెండు మూడు రోజుల్లో తల్లి పాలు పడలేవని బేబికి తేనె, గ్లూకోస్ తదితర వాటిని ఇవ్వరాదని సూచించారు. గర్భిణిగా ఉన్నప్పటి నుంచి అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టిక ఆహారం తీసుకోవాలని చెప్పారు. అనంతరం పలువురికి సామూహిక శ్రీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన చేశారు.కార్యక్రమంలో ఈశ్వరమ్మ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

దౌల్తాబాద్: మండల పరిధి బాలంపేట సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని ఏఈ మహిపాల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం మధ్యాహ్నం 12 గంటల నుంచి 2 గంటల వరకు సబ్‌స్టేషన్ పరిధిలో సరఫరా నిలిపివేయనున్నట్ల తెలిపారు.

మూడు రోజుల పాటు..

కొడంగల్: మండల పరిధి రుద్రారం గ్రామంలో విద్యుత్ దీపాలు అమర్చడం తదితర మరమ్మతుల కారణంగా శనివారం నుంచి సోమవారం వరకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని ట్రాన్స్‌కో అధికారులు పేర్కొన్నారు. అదే విధంగా చిట్లపల్లిలో వివిధ మరమ్మతుల కారణంగా అదే సమయంలో బుల్కాపూర్, చిట్లపల్లి, ఐనన్‌పల్లి, ఖాజాఅహ్మద్‌పల్లి గ్రామాల్లో సరఫరా నిలిపివేయనున్నామని, ఈ అసౌకర్యానికి చింతిస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఘనంగా పోచమ్మ బోనాలు

కుల్కచర్ల: మండల కేంద్రంలో శుక్రవారం పోచమ్మ బోనాల పండుగ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా భక్తులు ఉదయం నుంచి సాయంత్రం వరకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పిండి వంటకాలతో అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించారు.

ఆస్పత్రి లేదు.. అంబులెన్స్‌లు లేవు

పేరుకే మండలం. కానీ ప్రజలకు కనీస సౌకర్యాలు కరువైన ప్రాంతం. సుమారు 50వేల జనాభా ఉన్న దుద్యాల్‌లో సరైన వైద్యసేవలు అందించే సర్కారు దవాఖాన లేకపోవడం గమనార్హం. ప్రాథమిక చికిత్స కూడా అందని దుస్థితి నెలకొంది.

కరువైన వైద్య సేవలు
- సబ్ సెంటర్లతో కాలం ఎల్లదిస్తున్న వైనం
- అత్యవసర సమయంలో ప్రైవేట్ వాహనాలే దిక్కు
- పట్టించుకోని పాలకులు, అధికారులు
- ముఖ్యమంత్రి ఇలాకాలో ప్రజల దుస్థితి

దుద్యాల్: విద్య, వైద్య రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని ప్రభుత్వాలు చెబుతున్నా.. వాస్తవ రూపంలో అవి కార్యరూపం దాల్చడం లేదు. ప్రజారోగ్యం గురించి సంబంధిత అధికారులు చొరవ చూపడం లేదు. సాక్షాత్తు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నియోజకవర్గం కొండంగల్ పరిధి దుద్యాల్ మండల కేంద్రంలో వైద్య సౌకర్యం లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ప్రాథమిక ఆరోగ్యం ఉపకేంద్రం ఉన్నప్పటికీ.. జ్వరం వచ్చిందని వెళితే ఒకమాత్ర ఇవ్వటానికే పరిమితమయిందని, కనీసం ప్రాథమిక చికిత్స చేసే సౌకర్యం అందులో కొరవడిందని స్థానికులు పేర్కొంటున్నారు.

పెరుగుతున్న ప్రమాదాలు

మండలానికి ఆనుకుని అంతర్రాష్ట్ర రాహదారిగా ఉన్న రోడ్డు కాస్త.. నేషనల్ హైవేగా మారుతున్న క్రమంలో అనేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. ఏదైనా సంఘటన జరిగిన సమయంలో క్షతగాత్రులకు స్థానికంగా మెరుగైన వైద్య చికిత్సలు అందించే ధర్మాసుపత్రి లేదు. పోనీ మరో ప్రాంతానికి అత్యవసరంగా తరలించి వైద్యం చేయించాలంటే.. అంబులెన్స్ కరువు. విధిలేని పరిస్థితుల్లో ప్రైవేట్ వాహనాలను సంప్రదించాల్సి వస్తుందని స్థానిక ప్రజలు తెలిపారు. ప్రాథమిక ఉప కేంద్రం ఉన్నా.. సాధారణ వైద్య సేవలు అందడం లేదని పేర్కొంటున్నారు.



పల్లె దవాఖాన

ప్రాణాలకు ముప్పు

ఒక రోడ్డు ప్రమాదాలే కాదే.. మండల పరిధి గ్రామాల్లో ఏదైనా అనుకోని సంఘటన జరిగితే.. చికిత్సకోసం ఇతర ప్రాంతాలకు పరుగు తీయాల్సిన పరిస్థితి. ఆలస్యం అవుతున్న కొద్దీ.. ప్రాణాలకు ముప్పు ఏర్పడుతుందన్న బాధలో.. బాధితుడి సన్నిహితులు ప్రైవేట్ వాహనాల్లో కోస్గి, కొడంగల్, తాండూరు, మహబూబ్‌నగర్ తదితర పట్టణ ప్రాంత ఆస్పత్రులకు తరలిస్తున్నారు. ఈ క్రమంలో బాధితుల ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఉన్నట్లు తెలుస్తోంది. స్థానికంగా ఆస్పత్రి, అంబులెన్స్ అందుబాటులో ఉంటే.. ప్రాంత ప్రజలకు సకాలంలో వైద్యం అందుతుందని మండల ప్రజలు స్పష్టంచేస్తున్నారు.



అద్దె గదిలో ఆరోగ్య ఉప కేంద్రం

ప్రారంభం కాని పల్లె దవాఖాన

మండల కేంద్రంలో ఇటీవల నిర్మించిన పల్లె దవాఖాన ప్రారంభానికి నోచుకోవడం లేదు. ఉన్న ఆరోగ్య ఉప కేంద్రం ఇరుకైన అద్దె ఇంట్లో కొనసాగుతోంది. ప్రథమ చికిత్స చేయడానికి కూడా భవనం సౌకర్యంగా లేదంటూ వైద్య సిబ్బంది పేర్కొంటున్నారు. పల్లె దవాఖాన ప్రారంభిస్తే అన్నింటికీ సౌకర్యంగా ఉంటుందని తెలిపారు.

పంట నమోదును పూర్తి చేయండి

- ఏడీఏ సౌభాగ్యలక్ష్మి కుమారి



రైతు వేదికలో మాట్లాడుతున్న ఏడీఏ

దోమ: రైతులు సాగు చేసిన పంటలను త్వరితగతిన ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని పరిగి వ్యవసాయ సంచాలకులు సౌభాగ్యలక్ష్మి కుమారి సంబంధిత అధికారులకు సూచించారు. శుక్రవారం మండల పరిధి దాదాపూర్ గ్రామంలో పొలాల వద్దకు వెళ్లి, పంట వివరాలను ఏఈఓ చెన్నయ్యతో కలిసి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. అనంతరం రైతు వేదికలో రుణమాఫీ ప్రక్రియలో రైతుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రభుత్వం అన్నదాతల అభ్యున్నతికి కృషి చేస్తుందని తెలిపారు. ఇప్పటికే రెండు విడుతల రుణమాఫీని పూర్తి చేసిందని, మూడో విడతకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని పేర్కొన్నారు. ఎవరూ ఆందోళన చెందవద్దని చెప్పారు.

ప్రభుత్వ నిర్ణయం ఉపసంహరించుకోవాలి



కడా సిబ్బందికి వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

కొడంగల్ రూరల్: మధ్యాహ్న భోజన పథకాన్ని హరేరామ–హరేకృష్ణ స్వచ్ఛంద సంస్థకు అప్పజెప్పడాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని కడా కార్యాలయం ఎదుట భోజన పథకం కార్మికులు.. సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తంచేశారు. మధ్యాహ్న భోజనాన్ని సంస్థకు కట్టబెట్టడాన్ని రద్దు చేసి, మధ్యాహ్న భోజన కార్మికులచే కొనసాగించాలని డిమాండ్ చేశారు. వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. అనంతరం కడా సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. ఇందులో భోజన కార్మిక సంఘం నాయకులు లక్ష్మి, జయమ్మ, లావణ్య, వెంకటమ్మ, సరళ, ఆశమ్మ, పద్మ ఉన్నారు.



తాండూరు టౌన్: అవగాహన ర్యాలీలో పాల్గొన్న చైర్‌పర్సన్, కమిషనర్ తదితరులు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

- వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలి
- అవగాహన కార్యక్రమంలో చైర్‌పర్సన్ స్వప్న, కొడంగల్ కమిషనర్ బలరాం

తాండూరు టౌన్: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్న అన్నారు. డ్రై డేను పురస్కరించుకుని శుక్రవారం పట్టణంలోని 25వ వార్డులో కౌన్సిలర్ ప్రభాకర్ గౌడ్‌తో కలిసి పరిశుభ్రతపై ర్యాలీ చేపట్టారు. ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ఇళ్లలోని పాత కుండలు, డబ్బాల్లో నిల్వ ఉన్న నీటిని పారబోయించారు. వ్యక్తిగత, పరిసరాల శుభ్రతను పాటించాలని సూచించారు. తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ వాహనాలను అందించాలని, రోడ్లపై వేయరాదని కోరారు. వీటి వలన దోమలు, ఈగల బెడద పెరిగి, వ్యాధులు సంక్రమించే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ విక్రమ్‌సింహా రెడ్డి పాల్గొన్నారు.

కొడంగల్‌లో..

కొడంగల్: సీజనల్ వ్యాధుల కాలంలో ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని, అందులో భాగంగా వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను పాటించాలని మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్, మలేరియా యూనిట్ అధికారి పకీరప్ప సూచించారు. అంటువ్యాధులపై ఇంటింటికీ తిరిగి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మలేరియా, డెంగీ, విరేచనాలు, డయేరియా, ఇతర విష జ్వరాలు సోకకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. దోమల నివారణకు రసాయన మందులు పిచికారీ చేస్తున్నట్లు చెప్పారు.



కొడంగల్‌లో.. మునిసిపల్ కమిషనర్ తదితరులు

పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం తగదు

పెద్దేముల్: పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం తగదని, ప్రజారోగ్యమే లక్ష్యంగా పనిచేయాలని డీఎల్‌పీఓ శంకర్‌నాయక్ అన్నారు. శుక్రవారం మండల పరిధి మదనంతాపూర్, రేగొండి, మంబాపూర్ తదితర గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా డీఎల్‌పీఓ మాట్లాడారు. వర్షాకాలం నేపథ్యంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని చెప్పారు. ప్రతి శుక్రవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని జీపీ కార్యదర్శులకు సూచించారు. దోమల నివారణకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంపీఓ రతన్‌సింగ్ ఉన్నారు.

మూడు దశాబ్దాల పోరాట ఫలితం

- వర్గీకరణపై తీర్పుపై హర్షం వ్యక్తంచేసిన ఎమ్మార్పీఎస్, ప్రజాసంఘాల నేతలు

కొడంగల్ రూరల్: సర్వోన్నత న్యాయస్థానం ఏడుగురు సభ్యులతో కూడిన ధర్మాసనం ఎస్సీ వర్గీకరణ చేసేందుకు రాష్ట్రాలకు వెసులుబాటు కల్పిస్తూ తీర్పును ఇవ్వడం సంతోషంగా ఉందని ఎమ్మార్పీఎస్ నాయకులు హర్షం వ్యక్తంచేశారు. మూడు దశాబ్దాల పోరాటానికి ఫలితం దక్కిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం పట్టణంలోని అంబేడ్కర్ కూడలిలో సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. విజయోత్సవ ర్యాలీ తీశారు. అనంతరం పలువురు మాట్లాడారు. వర్గీకరణ వలన సమాజంలో వెనుకబడిన కులాలు, వర్గాలకు సరైన సమయంలో సరైన న్యాయం జరుగుతుందన్నారు. కులగణన చేయకతప్పదని, పేద వర్గాలను గుర్తించి విద్యా ఉద్యోగ రంగాల్లో సమాన అవకాశాలు కల్పించేలా వ్యవస్థలు పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు. కార్యక్రమంలో సమితి సీనియర్ నాయకుడు సోమశేఖర్, జిల్లా ఉపాధ్యక్షుడు మల్కప్ప, జిల్లా కార్యదర్శి ఆర్.అంజి, ఎస్సీ,ఎస్టీ మానిటరింగ్ సభ్యుడు దస్తప్ప, సమితి మండల అధ్యక్షుడు అశోక్, ఉపాధ్యక్షుడు సీను, నాగప్ప, నాయకులు నర్సప్ప, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీలకు మేలు

కొడంగల్: వర్గీకరణతో ఎస్సీలకు మేలు జరుగుతుందని ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు సోమశేఖర్ అన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమితి ఆధ్వర్యంలో ముప్పై ఏళ్లుగా ఉద్యమం చేశామని, ఆ పోరాట ఫలితమే నేటి తీర్పు అని పేర్కొన్నారు. వర్గీకరణ అమలు అనంతరం ఎస్సీలకు అన్ని రంగాల్లో ఉద్యోగ ఉపాధి అవకాశాలు దక్కుతాయన్నారు. తెలంగాణలో సీఎం రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉన్నారని చెప్పారు.

ధర్మం గెలిచింది

దోమ: ఎస్సీ వర్గీకరణకు సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని సమాచార హక్కు చట్టం మండల ఉపాధ్యక్షుడు నర్సింలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ దశాబ్దాలుగా పోరాటం చేశారని, చివరికి న్యాయం, ధర్మం గెలిచిందని పేర్కొన్నార



కొడంగల్ రూరల్: అంబేడ్కర్ కూడలిలో సంబురాలు చేసుకుంటున్న సమితి నాయకులు

విజయోత్సవ ర్యాలీ

అనంతగిరి: ఎస్సీ వర్గీకరణను సుప్రీంకోర్టు సమర్థించిన సందర్భంగా ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ ఆధ్వర్యంలో వికారాబాద్ పట్టణంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆనంద్ మాట్లాడుతూ కోర్టు తీర్పు యావత్ మాదిగ, మాదిగ ఉప కులాలకు సంతోషాన్ని కలిగించిందని పేర్కొన్నారు. మందకృష్ణ మాదిగ చేసిన ఉద్యమం.. నేడు ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలుస్తుందని కొనియాడారు. ఇందులో సమితి జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్, జిల్లా ప్రధాన కార్యదర్శి స్వామిదాస్, సీనియర్ నాయకులు ఆనంద్, జగన్, భరత్, మోహన్, ఆశన్న, శ్రీనివాస్, సుభాష్, అశోక్ అనంతయ్య, శివాజీ, అజయ్ ఉన్నారు.

చరిత్రాత్మక తీర్పు

మోమిన్‌పేట: ఎస్సీ,ఎస్టీ వర్గీకరణను ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు అమలు చేసుకోవచ్చునని సుప్రీ కోర్టు తీర్పు ఇవ్వడం చరిత్రాత్మకమని కాంగ్రెస్ పార్టీ నాయకుడు సుభాష్‌గౌడు అన్నారు. మండల కేంద్రంలో అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాలలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. వర్గీకరణ కోసం సుదీర్ఘకాలంగా పోరాడుతున్నామని, ఎట్టకేలకు సమాన హక్కులు పొందే అవకాశం వచ్చిందని పేర్కొన్నారు. ఇందులో నాయకులు రవి, చెన్న, రత్నం, నర్సింలు తదితరులు ఉన్నారు.



అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సంక్షిప్త వార్తలు

◆ నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

తాండూరు: తాండూరు మున్సిపల్ కార్యాలయంలో శనివారం కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నారు. చైర్‌పర్సన్ స్వప్నపరిమళ్ అధ్యక్షతన జరిగే సమీక్షకు.. కౌన్సిల్ సభ్యులకు 30 అంశాలతో కూడిన ఎజెండాను అధికారులు పంపించారు.

◆ ఉపాధ్యాయులకు సన్మానం



కొడంగల్ రూరల్: స్థానిక పాఠశాలలో పనిచేసి బదిలీపై వెళ్తున్న హెచ్ఎం క్రాంతికుమార్, ఉపాధ్యాయురాలు సంధ్యలను గ్రామస్తులు, విద్యార్థులు శాలువాలు కప్పి, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఇందులో ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ పార్వతమ్మ, కాంగ్రెస్ నాయకులు బుగ్గప్ప తదితరులు ఉన్నారు.

◆ నోట్ బుక్‌ల పంపిణీ

పెద్దేముల్: బీసీ కమిషన్ సభ్యుడు శుభ్‌ప్రద్ పటేల్ జన్మదినం సందర్భంగా శుక్రవారం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు నోట్ బుక్‌లు ఉచితంగా పంపిణీ చేశారు. ఇందులో భాను, హరీశ్, యావుష్, చంద్రశేఖర్, రవి, మతిన్, మోహమ్మద్ ఉన్నారు.

◆ సభకు తరలిన ఉపాధ్యాయులు

కొడంగల్: ప్రభుత్వం చేపట్టిన బదిలీలు, పదోన్నతుల్లో లబ్ధిపొందిన జీహెచ్ఎమ్, ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లు, భాషోపాధ్యాయులు హైదరాబాద్ లాల్ బహదూర్ స్టేడియంలో నిర్వహించిన సీఎం కృతజ్ఞత సభకు వెళ్లారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్సులను ఎంఈఓ రాంరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఇందులో ఉపాధ్యాయ సంఘం నాయకులు వేణుగోపాల్, బాకారం చంద్రశేఖర్, బాకారం మల్లయ్య, కరుణాకర్, చంద్రకాంత్, వెంకట్‌రాములు, విష్ణుకుమార్ ఉన్నారు.

◆ విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

దుద్యాల్: చిన్నారుల ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోస్గి శ్రీహర్ష ఆస్పత్రి వైద్యుడు పూర్ణచంద్ర యాదవ్ సూచించారు. శుక్రవారం హస్నాబాద్ నేతాజీ ఉన్నత పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో 200 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు.

◆ మహాదేవుని ఆలయంలో పూజలు

కొడంగల్ రూరల్: శ్రీమహాదేవుని ఆలయంలో మాస శివరాత్రిని పురస్కరించుకొని శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ భజన మండలి ఆధ్వర్యంలో ఉదయం 10గంటల నుంచి లింగాష్టక పారాయణం, 12గంటలకు శివలింగానికి పంచామృతంతో పూజలు నిర్వహించారు. విశేష అలంకరణ, బిల్వాష్టకం, శివాష్టకం, శివ అష్టోత్తర శతనామావళి, ధూప దీప నైవేద్యాలను సమర్పించారు.

◆ కృష్ణం రాజుకు సన్మానం



కొడంగల్: యువజన కాంగ్రెస్ జాతీయ సమన్వయ కర్తగా నియమితులైన కృష్ణం రాజును మైనార్టీ నాయకులు శుక్రవారం సన్మానించారు. ఇందులో మాజీ ఉప సర్పంచ్ ఎస్ఎంగౌసన్, మైనార్టీ నాయకులు జాకీర్, షేక్ సాబిర్, సలీమ్, సయ్యద్ వాహిద్, ఖాలీద్, రహీం, ఇర్ఫాన్ ఉన్నారు.

◆ సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

కొడంగల్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి శుక్రవారం పట్టణంలోని అంబేడ్కర్ కూడలిలో క్షీరాభిషేకం చేశారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న 583 కళాకారులకు గత ప్రభుత్వం ఉద్యోగాలు ఇచ్చింది. ప్రస్తుతం ప్రభుత్వం.. ఉద్యోగాలు పొందిన కళాకారులకు జీతాలు పెంచింది. దీంతో జిల్లా సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. ఇందులో వెంకట్రాములు, శ్రీనివాసులు, సంజీవ, భిక్షపతి, అన్నుబాయి, అర్చన, సంధ్య, స్వప్న, సైదమ్మ ఉన్నారు.

◆ విద్యుత్ సమస్యలు పరిష్కరిస్తాం

దౌల్తాబాద్: గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కొడంగల్ ఏడీఈ నవీన్‌కుమార్ తెలిపారు. శుక్రవారం తిమ్మారెడ్డిపల్లి గ్రామంలో కొంత కాలంగా విద్యుత్ తీగలు ఇళ్లపై వేలాడుతున్నాయని, వర్షాకాలంలో ప్రమాదం జరగనుందని ఏడీఈకి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఏఈ మహిపాల్‌తో కలిసి ఆయన గ్రామంలోని సమస్యలను పరిశీలించారు. త్వరలో సమస్య తీరుస్తామని గ్రామస్తులకు వివరించారు.

◆ వేతనాలు పెంచాలని వినతి

తాండూరు టౌన్: వేతనాలు పెంచాలంటూ పలువురు పట్టణ మున్సిపల్ జవాన్లు మున్సిపల్ స్టాఫ్ అండ్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కమిషనర్ విక్రమ్‌సింహా రెడ్డికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. చాలీచాలని వేతనాలతో జీవనం కొనసాగిస్తున్నామని, జీతాలు పెంచాలని ప్రభుత్వం జీఓ జారీ చేసిందని గుర్తుచేశారు. అనారోగ్యంతో మృతి చెందిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులను నియమించాలని కోరారు.

◆ వెంకట్‌రెడ్డికి వీడ్కోలు



పరిగి: పరిగి జూనియర్ సివిల్ కోర్టు ఏజీపీ ప్రభుత్వ న్యాయవాదిగా వెంకట్‌రెడ్డి రెండేళ్లుగా పని చేస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం కొత్తవారిని నియమించడంతో శుక్రవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఇందులో సభ్యులు భక్త కుమార్, ఇబ్రహీం, కృష్ణారెడ్డి, లింగం, దామోదర్‌రెడ్డి, బాలముకుందం తదితరులు ఉన్నారు.

◆ జీపీ కార్యదర్శులకు సన్మానం



దుద్యాల్: బదిలీపై వెళ్తున్న పంచాయతీ కార్యదర్శులను శుక్రవారం గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఈర్లపల్లి కార్యదర్శిగా పని చేసిన ప్రభాకర్ బొంరాస్‌పేట మండలం ఎన్కేపల్లికి, సంత్రకుంట తండా జీపీ కార్యదర్శిగా పని చేసిన నరేందర్ బొంరాస్‌పేట మండలం కొత్తూరు పరిధి ఎనిమిది తండాకు బదిలీపై వెళ్లారు. దీంతో ఆయా గ్రామస్తులు కార్యదర్శులను ఘనంగా సన్మానించారు. గ్రామ యువజన నాయకులు నానావత్ రవి నాయక్, మొగులయ్య, పెంటయ్య, వెంకటయ్య ఉన్నారు.

కార్యక్రమాల నిర్వహణకు పర్మిషన్ తీసుకోవాలి

కొడంగల్ రూరల్: ఏమైనా కార్యక్రమాలు నిర్వహించాలనుకునే వారు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని హెడ్ కానిస్టేబుల్ శివరాములు గౌడ్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. కూడళ్ల, తదితర ప్రాంతాల్లో పాలాభిషేకాలు, హర్షం వ్యక్తంచేయడం, నిరసనలు తెలపడం లాంటివి చేపట్టాలనుకునే ప్రజా సంఘాలు, రాజకీయ నాయకులు, ప్రజా ప్రతి నిధులు ఎవరైనా సరే పోలీసు శాఖ పర్మిషన్ తీసుకోవాలని సూచించారు. ముందస్తు సమాచారం ఉన్నట్లయితే అందుకు అనుగుణంగా ట్రాఫిక్ అంతరాయం కలగకుండా పోలీసులు జాగ్రత్తలు తీసుకునేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అంతే కాకుండా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా బందోబస్తు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

శాకంబరీగా రేణుకా ఎల్లమ్మ



మూలమూర్తి

తాండూరు టౌన్: ఆషాఢ మాసం చివరి శుక్రవారాన్ని పురస్కరించుకుని పట్టణంలోని నెహ్రూగంజ్ రేణుకా ఎల్లమ్మ శాకంబరీగా భక్తులకు దర్శనమిచ్చారు. రకరకాల కూరగాయలతో అమ్మవారిని అలంకరించగా.. భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.